క్లుప్తంగా

శాకంబరీగా పోలేరమ్మ తల్లి



అచ్చంపేట: మండలంలోని చామర్రులో గ్రామదేవతగా కొలిచే పోలేరమ్మ తల్లిని ఆదివారం శాకంబరీగా అలంకరించారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భక్తులు వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో ఈ అలంకరణ చేశారు. సంస్థ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. ఆషాఢ మాసం ఆదివారం నాడు అమ్మవారిని శాకంబరీగా అలంకరించడం ఆనవాయితీ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. భజన చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎస్టీయూ రాష్ట్ర వృత్తి విద్యాకమిటీ కన్వీనర్‌గా మోహన్‌రావు



నకరికల్లు: ఎస్టీయూ రాష్ట్ర వృత్తి విద్యాకమిటీ కన్వీనర్‌గా మండలంలోని చేజర్ల గ్రామం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గేరా మోహన్‌రావు ఎంపికయ్యారు. ఎస్టీయూ రాష్ట్ర సంఘం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 26 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మోహన్‌రావుకు సముచితస్థానం దక్కిందన్నారు. మోహన్‌రావును ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, మండల నాయకులు రాంబాబు, పరమేశ్వరరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



అచ్చంపేట: ఇంజినీరింగ్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని దేశిరెడ్డి లక్ష్మీపార్వతికి ఆదివారం స్నేహహస్తాలు ఫౌండేషన్ తరఫున రూ.40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను సంస్థ సభ్యులు తుమ్మా శౌర్రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ.. విద్యార్థిని ప్రతిభతో గుంటూరులోని ఓ కాలేజీలో సీటు సాధించి బీటెక్ (డేటా సైన్స్) రెండో సంవత్సరం చదువుతోందన్నారు. మొదటి సంవత్సరంలో కూడా తామే హాస్టల్ ఫీజు చెల్లించినట్లు చెప్పారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సంస్థ ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన అవసరం



క్రోసూరు: కామన్ మ్యాన్ ఫర్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వడ్లమూడి బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. బిల్లులు, కవర్లు, బ్యాగులు పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగా ఉంచాలని రైతులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు కూడా నకిలీ కంపెనీలపై ఉక్కుపాదం మోపాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నెల్లూరి రమేష్ తదితరులు సేవలందించారు. సుమారు 100 మందికిపైగా మెదడు, నరాల సంబంధిత పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు అందించారు. గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక ఆర్ఎంపీ బెల్లంకొండ వెంకటశేషయ్య, పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురు

బొల్లాపల్లి: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూజ్ఞాన వేదిక, పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రచారంలో భాగంగా భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందూజ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.భూలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యాన పంటకు 'ఉపాధి' ఊతం!

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతన్నలకు కూడా ఊతం లభించనుంది. పండ్ల తోటలు, పూల తోటల పెంపకానికి దీని కింద ప్రోత్సాహం అందిస్తోంది. ఇప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాలువల పూడిక తీత పనులతో వ్యవసాయానికి తోడ్పాటు అందిస్తున్నారు. ఉద్యాన పంటలను కూడా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా పండ్లతోటల పెంపకానికి మూడేళ్లు, పూల తోటల పెంపకానికి రెండేళ్లపాటు నిర్వహణ ఖర్చులను రైతులకు అందించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతులు పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



పండ్ల మొక్కలు నాటుతున్న దృశ్యం

- పెంపకానికి పథకం కింద మరింత ప్రోత్సాహం
- క్లస్టర్ పరిధిలో 1,800 ఎకరాల్లో సాగు లక్ష్యం
- నెలాఖరు వరకు రైతులకు దరఖాస్తు గడువు

ముప్పాళ్ల: సత్తెనపల్లి క్లస్టర్‌లోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 9 మండలాల్లో 1,800 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయాలని 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 243 ఎకరాల్లో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. మరో 200 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతుల వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి గల రైతులు ఈ నెలాఖరులోగా ఆయా మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఉద్యాన పంటల సాగుకు సాయం పొందేందుకు సన్న, చిన్నకారు రైతులు మాత్రమే అర్హులు. బీసీలు అయితే ఐదెకరాల్లోపు, ఎస్సీ, ఎస్టీలు అయితే 10 ఎకరాల్లోపు మెట్టభూమి కలిగి ఉండాలి. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, 1బీ అడంగల్, బ్యాంక్ పాసుపుస్తకం, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు పత్రాలతోపాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంత

12 రకాలకు అవకాశం

ఉపాధి హామీ పథకం ద్వారా 12 రకాల పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చు. నేల స్వభావం ఆధారంగా పండ్ల మొక్కలు అందిస్తారు. ఎకరాకు మామిడి 70, జీడిమామిడి 70, బత్తాయి 100, నిమ్మ 110, జామ 110, తైవాన్‌జామ 440, నారింజ 100, సపోట 60, సీతాఫలం 50, అల్లనేరేడు 60, చింత 40, కొబ్బరి 60 చొప్పున మొక్కలు అందిస్తారు. పూలతోటలకు సంబంధించి గులాబి 2 వేలు, మల్లె 1,600 మొక్కలు వంతున ఇస్తారు. పండ్ల తోటలకు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు రూ.1.10 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు అందిస్తారు. మొక్క ధర, గుంత తీయడానికి రూ.96, మొక్క వేయడానికి రూ.17 చొప్పున చెల్లిస్తారు. సంరక్షణకు నెలకు రూ.2,200 చొప్పున ఏడాదికి 8 నెలల పాటు అందిస్తారు. ఈ విధంగా రైతులకు మూడేళ్ల పాటు చెల్లిస్తారు. పూల మొక్కలకు సంబంధించి రెండేళ్లపాటు మాత్రమే ఇస్తారు.

అర ఎకరంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశా



ఉపాధి హామీ పథకం ద్వారా అర ఎకరంలో డ్రాగన్‌ఫ్రూట్ పంట సాగు చేశా. మొత్తం రూ.1.60 లక్షలు అంచనా వేశారు. సిమెంట్ రాళ్లు, మొక్కలకు, గుంతలు తీసినందుకుగాను ఇప్పటికే రూ.లక్ష అందించారు. ఉద్యాన పంటల సాగుకు ఉపాధి హామీ సిబ్బంది పూర్తి సహకారం అందిస్తున్నారు.

– ప్రత్తిపాటి గోవిందయ్య, లంకెలకూరపాడు, ముప్పాళ్ల మండలం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



2024–25 ఆర్థిక సంవత్సరంలో క్లస్టర్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 1,800 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని లక్ష్యంగా పనిచేస్తున్నాం. అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకుంటే ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తాం. ఇప్పటికే పలు గ్రామాల్లో పండ్ల మొక్కలు నాటుతున్నాం. ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లోని రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం అందించే ఈ ప్రోత్సాహకాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి.

– పొత్తూరి వెంకట నారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి క్లస్టర్

లయన్స్‌క్లబ్ సేవల విస్తరణే లక్ష్యం

సత్తెనపల్లి: సేవలు విస్తరించడమే తమ లక్ష్యమని లయన్స్ క్లబ్ 316 మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్, పీఎంజేఎఫ్ లయన్ దామర్ల శ్రీశాంతి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గో సంరక్షణ శాల కళ్యాణ మండపంలో లయన్ పొన్నెకంటి కిషోర్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సత్తెనపల్లి టౌన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాదిలో కోటి మందికి అన్న సంతర్పణ, కోటి మొక్కలు నాటడం లక్ష్యమన్నారు. దాతలు సహకరించాలన్నారు. విశిష్ట అతిథి సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ తమవంతు సహకారం అందిస్తామన్నారు. మరో అతిథి సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కోటి మందికి అన్నసంతర్పణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా చేయాలన్నారు. తర్వాత పేద మహిళకు వెట్ గ్రైండర్, 27 మంది హాస్టల్ విద్యార్థులకు విద్యాసామగ్రి, 11 మందికి దుప్పట్లు, 10 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాస్టర్ ఆఫ్ సెర్మనీగా వైపీ మురళీకృష్ణ, కంబాల వెంకటేశ్వరరావులు వ్యవహరించారు. సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా పొన్నెకంటి కిషోర్‌కుమార్, కార్యదర్శిగా బండ్లమూడి వీరాంజనేయులు, కోశాధికారిగా బత్తుల రోశయ్య, ఉపాధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్లు, టి.సాంబశివరావు, కె.రాజశేఖరరావు, సంయుక్త కార్యదర్శిగా తోట పద్మ, టామర్‌గా డాక్టర్ వి.వి.రామకృష్ణమాచార్యులు, టైల్ ట్విస్టర్‌గా బి.విజయలక్ష్మి, రెండేళ్ల డైరెక్టర్లుగా పి.చంద్రయ్య, పెరుమాళ్ళ శ్రీనివాసరావు, పాతూరి రామకోటయ్య, టి. భావన్నారాయణ, ఏడాది డైరెక్టర్లుగా వైపీ మురళీకృష్ణ, దేవిశెట్టి శ్రీనివాసరావు, కె.విష్ణువర్ధన్ రావు, కొండవీటి రాజు, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా టీసీహెచ్ సాంబశివయ్య, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా కోట వెంకటేశ్వర్లు, సర్వీస్ చైర్‌పర్సన్‌గా కంభాల వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా గ్రంధిశిల శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్‌పర్సన్‌గా టి. భావనారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు. ముద్దా రమేష్‌బాబు, మాడా రమేష్‌బాబు, కె.నాగేశ్వరరావులు కొత్తగా సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. ముందుగా లయన్ ఆర్. లక్ష్మీనారాయణ నూతన సభ్యులకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మంచికంటి వెంకటేశ్వరరావు, తిరుమల సాంబశివరావు, జి.గురుప్రసాద్, ఎ.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు వెట్ గ్రైండర్ అందిస్తున్న శ్రీశాంతి, ప్రతినిధులు



పట్టణ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌ను సత్కరిస్తున్న మంచికంటి

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

అచ్చంపేట: మండలంలోని పెదపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో 145 మంది సభ్యులకు ఆదివారం రూ.5 లక్షల బోనస్ పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి చిరుమామిళ్ల నరసింహారావు ఈ విషయం తెలిపారు. గత ఏడాదిగా ఎక్కువ పాలు పోసిన వట్టికొండ వెంకటేశ్వర్లుకు రూ.30 వేలు, పాటిబండ్ల వెంకటేశ్వర్లుకు రూ.19 వేలు, పాటిబండ్ల హనుమంతరావుకు రూ.14,500 చొప్పున అత్యధిక బోనస్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, రెంటపాళ్ల బ్రాంచి మేనేజర్ టి.గోపి, సంఘ అధ్యక్షులు పి.వెంకట నారాయణ, సూపర్‌వైజర్ నరేంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బోనస్ అందిస్తున్న సంఘ ప్రతినిధులు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు డ్రైవర్లకు గాయాలు
- ప్రయాణికులు సురక్షితం

నకరికల్లు: మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున సంభవించిన ఘటనకు సంబంధించిన వివరాలు... రొంపిచర్ల మండలంలోని విప్పర్ల గ్రామం వైపు నుంచి ట్రాక్టర్ మట్టిలోడుతో పిడుగురాళ్ల వైపు వెళుతోంది. సుమారు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఈ ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడింది. బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు నిద్రమత్తులో ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భయంతో హాహాకారాలు చేశారు. సమీపంలోని హోటళ్ల వారి సహకారంతో అందరూ క్షేమంగా కిందకు దిగారు. ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ నిజాంఖాన్‌కు గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి బత్తుల చినసుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 సహాయంతో నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పోలీసులు ట్రాక్టర్‌ను, మట్టిని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు తెలిపారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



బోల్తా పడిన ట్రాక్టర్

ఘర్షణలో యువకుడికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: బార్ వద్ద జరిగిన ఘర్షణలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట శనివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... క్రిస్టియన్‌పేటకు చెందిన తొమండ్రు ప్రసాద్ శనివారం రాత్రి తాళ్ళూరు నరేష్ అనే వ్యక్తితో కలిసి ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు వెళ్లారు. స్నేహితుడు గణేష్‌ను కలిశారు. గణేష్, నరేష్‌కు మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. గణేష్ బీర్ బాటిల్‌తో దాడి చేయగా మధ్యలో ఉన్న ప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. గణేష్ వర్గం వారైన సుబ్బయ్య, వలిలు కూడా అక్కడికి వచ్చారు. ఇరువర్గాలు మరింత పెద్దగా గొడవ పడబోతుండగా స్థానికులు అప్రమత్తం కావడంతో వెళ్లిపోయారు. దీనిపై ప్రసాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన

క్రోసూరు: మహిళా సంరక్షణ చట్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి మాట్లాడుతూ.. భారత న్యాయ సంహితలో సెక్షన్ 63 నుంచి 99 వరకు మహిళలు, బాలికల రక్షణకు సంబంధించి ఉన్న అంశాలను వివరించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181 గురించి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వి.మాధవి

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం

రెంటచింతల: వ్యక్తిగత శుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతతోనే వివిధ రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన రెంటచింతలలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్మికులకు పలు సూచనలు చేసి, మాట్లాడారు. గ్రామాలలోని సైడు కాల్వలలోని మంచినీటి పైపులను వెంటనే తొలగించి కాల్వలకు పైభాగంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇటీవల పలు గ్రామాలలో మురుగు నీటి కాల్వలలో నున్న పైపు లైన్‌ల ద్వారా సరఫరా చేసిన మంచినీటిని తాగడం వల్ల కొందరు డయేరియా బారిన పడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వర్షాకాల సీజన్‌లో విష జ్వరాలతోపాటు పలు రకాల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామాలలోని పారిశుద్ధ్య పనులకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. సైడు కాల్వలలో పూడికలు తొలగించాలని హెచ్చరించారు. మండల పరిధిలోని కార్యదర్శులు ప్రతి గ్రామంలో ఇళ్ల మధ్య మురుగునీరు లేకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

నకరికల్లు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ప్రధాన లైనుకు సర్వీస్ వైరు కనెక్షన్ ఇస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గుండ్లపల్లి గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన రామారావు విద్యుత్ బిల్లు చెల్లించలేదని ఆ శాఖ వారు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. ఈ క్రమంలో రామారావు సూచన మేరకు కోపూరి నాగరాజు ప్రధాన లైనుకు సర్వీస్ వైరు జోడించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ఆ సమయంలో షాక్‌కు గురయ్యాడు. క్షతగాత్రుడిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా.. క్షతగాత్రుడికి డిపార్ట్‌మెంట్‌తో సంబంధం లేదన్నారు. ప్రమాదం విషయం కూడా తమకు తెలియదన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

31న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

క్రోసూరు: మండలంలోని విప్పర్ల గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులలో మిగిలిన ఖాళీలకు ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ బీవీ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 10 వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ తదితరాలతో రావాలని కోరారు. వివరాలకు 94406 13009 ఫోను నెంబరులో సంప్రదించాలని రమాదేవి సూచించారు.

అన్నదానానికి రూ.40 వేల విరాళం

అమరావతి: శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తులు సుమారు రూ.40 వేలు విరాళంగా అందించారు. ఇందులో కృష్ణా జిల్లా నిడమానూరుకు చెందిన పమిడి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు రూ.10,116 ఇచ్చారు. ఆలయంలో అమరేశ్వుడికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ దేవి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం ఈవో వేమూరి గోపీనాథశర్మకు భక్తులు విరాళాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. ఎక్స్ అఫిషీయో సభ్యుడిగా సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వావిలాల ఘాట్ పరిసరాలపై పర్యవేక్షణ పెంచాలి

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన సమరయోధుడు, పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య ఘాట్, పరిసరాలపై పర్యవేక్షణ పెంచాలని వావిలాల సంస్థ, ప్రజ్వలన సంస్థ బాధ్యులు కోరారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఘాట్‌లో ఆదివారం కొందరు చిన్నారులు చెప్పులతో సమాధిపైకి ఎక్కడంతో వారి తల్లిదండ్రులకు రెండు సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పించారు. పర్యవేక్షణ పెంచడానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న గరికపాటి శంకరరావు

రాజుపాలెం : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నేషనల్ యాంటీ క్రైం అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షులు గరికపాటి శంకరరావు అధ్యక్షతన కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వృద్ధుల ఆశ్రమంలో ఈ సమావేశం ఆదివారం నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో, కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటడం, పరిరక్షించడంపై తీర్మానాలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చీదేళ్ల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి కోనేటి నరసింహారావు, కార్యవర్గ సభ్యులు కాకుమాను శ్రీనివాసరావు, బాబూరావు, జాలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలేయం దెబ్బతింటే ప్రాణాలకే ప్రమాదం

సత్తెనపల్లి: కాలేయం దెబ్బతింటే నయం కావడానికి సమయం పడుతుందని, ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వస్తుందని నరసరావుపేట శకుంతల వైద్యశాల అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం హాల్‌లో వైద్యులకు కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలేయ వ్యాధికి చాలా మంది నాటు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. వ్యాధి ముదిరాక వైద్యుల వద్దకు వస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో 3 నుంచి 4 శాతం మందిని కాలేయ సమస్యలు వేధిస్తున్నట్లు అంచనా ఉందన్నారు. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉంటే హెపటైటిస్ ఏ,ఈ వైరస్‌లు దరి చేరవన్నారు. పరీక్షలు, చికిత్స గురించి వివరించారు. శ్రీవిద్య వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ తడవర్తి శ్రీవిద్య మాట్లాడుతూ.. మలబద్ధకం, చికిత్స గురించి వివరించారు. సమావేశంలో సత్తెనపల్లి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ జి. శ్రీధర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఐలా శ్రీనివాస్

బహిరంగ ప్రకటన

మా క్లయింటున్నూ కృష్ణాజిల్లా, కంచికచర్ల(మం), కీసర గ్రామ కాపురస్తురాలు మరియు దిడుగు కాపురస్తులు లేటు మంచినేని వేణు వినోద్ రావు గారి కుమార్తెయున్నూ, చెరుకూరి సత్యనారాయణగారి భార్య రాజ్యలక్ష్మీ గారి సూచనలమేరకు తెలియజేయునది ఏమనగా, **అమరావతి(మం), దిడుగు గ్రామం తాలూకు 1) డి.నెం.99/3 లోని య.2-94 సెంట్లు, 2) డి.నెం.86/1ఎలోని య.1-28 సెంట్లు, 3)డి.నెం.86/2సిలోని య.1-47సెంట్లు, 4)డి.నెం. 99/3లోని య.4-00సెంట్లు, 5) డి.నెం.213లోని య.4-00 సెంట్లు మరియు 6) డి.నెం.85/3లోని య.6-08సెంట్లు వెరశి య.19-77సెంట్లు భూములు** గురించి మా క్లయింటు మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు 1)మొక్కపాటి వీర నరశింహారావు, 2)చెన్నుమల్లు వినోద్‌రావు, 3) నడికట్ల ఎలిజిబెత్ రత్నకుమారి, 4)మందాడి నాగేశ్వరమ్మ మరియు ఇతరులపై ఓ.యస్.నెం.32/2019గల దావాను దాఖలుచేసి యున్నారు మరియు మా క్లయింటుపై 1)మొక్కపాటి వీర నరశింహారావు గారు ఓ.యస్.నెం.345/2016, 2)చెన్నుమల్లు వినోద్‌రావు గారు ఓ.యస్.నెం.349/2016, 3)నడికట్ల ఎలిజిబెత్ రత్నకుమారి గారు ఓ.యస్.నెం. 362/2016 దావాలును మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు నందు పై డి. నెంబర్ల ఆస్తుల గురించి దావాలు దాఖలు చేసియున్నారు. పై తెలిపిన నాలుగు దావాలు పై చెప్పబడిన డి.నెంబర్ల లోని ఆస్తులగురించి దాఖలు చేయబడి మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు నందు నిల్వలో ఉండియున్నవి. ఇట్లుండగా 1)మొక్కపాటి వీర నరశింహారావు, 2)చెన్నుమల్లు వినోద్ రావు, 3) నడికట్ల ఎలిజిబెత్ రత్నకుమారి మరియు 4) లేటు మందాడి నాగేశ్వరమ్మ గార్ల వారసులు పై నెంబర్లు దావాలను మధ్యవరచి పై తెలిపిన డి.నెంబర్లు లోని ఆస్తులను ఇతరులకు అమ్ము ప్రయత్నములలో ఉన్నారని తెలియవచ్చినది. కావున ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిడుగు గ్రామ తాలూకు డి.నెంబర్లలోని ఆస్తులను పైన తెలిపిన వ్యక్తుల వద్ద నుండి ఎవరైనా ఏవిధమైన క్రయవిక్రయాలు గాని, లావాదేవీలుగాని జరిపినచో అవి చెల్లనేరవు మరియు మా క్లయింటును గాని ఆమె హక్కులను గాని బద్ధపరచజాలవు.

ఏ. ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
లక్ష్మీపురం, గుంటూరు. సెల్ : 9866305759